క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి


కేజీబీవీలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై గంగన్న

లింగాపూర్: మండల కేంద్రంలోని కేజీబీవీలో బుధవారం ఎస్సై గంగన్న ఆధ్వర్యంలో మహిళల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ విద్యార్థినులకు రక్షణగా చట్టాలున్నాయని, వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈవ్‌టీజింగ్, సైబర్‌క్రైం, లైంగిక దోపిడీకి గురైనప్పుడు 100 డయల్ చేయాలని సూచించారు.

ఐకేపీ ఏపీఎంగా సూర్యకాంత్


బాధ్యతలు స్వీకరిస్తున్న సూర్యకాంత్

లింగాపూర్: మండల ఐకేపీ ఏపీఎంగా సూర్యకాంత్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం శ్యాంపూర్ ఏపీఎంగా పని చేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన తిరుపతి మంచిర్యాల జిల్లా కన్నెపల్లికి బదిలీ అయ్యారు. కాగా బాధ్యతలు స్వీకరించిన ఏపీఎంకు సీసీలు ప్రదీప్, కైలాస్, స్వర్ణ, గణేశ్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

'14 రకాల సరుకులు అందించాలి'


మాట్లాడుతున్న కూటికల ఆనంద్‌రావు

కెరమెరి: తెల్లరేషన్ కార్డు వినియోగదారులకు 14 రకాల నిత్యావసర సరుకులు అందించాలని సీఐటీయూ మండల కన్వీనర్ కూటికల ఆనంద్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఆసరా పింఛన్లను పెంచి ఇవ్వాలని పేర్కొన్నారు. సంతోష్, స్వామి, వెంకటేశ్, శ్రీనివాస్, తిరుపతి, అక్తర్ తదితరులు ఉన్నారు.

'బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి'


రెబ్బెన: స్వాగతం పలుకుతున్న నాయకులు

జైనూర్: బీజేపీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు పిలుపునిచ్చినట్లు మండల అధ్యక్షుడు ఔనేశ్వర్, సీనియర్ నాయకుడు కేంద్రే సుబోధ్‌కాంత్ పేర్కొన్నారు. బుధవారం ఆసిఫాబాద్‌లో రాంచందర్‌రావును కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.

రాంచందర్‌రావుకు స్వాగతం పలికిన మండల నాయకులు

రెబ్బెన: జిల్లా పర్యటనకు మొదటిసారిగా వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావుకు బుధవారం మండలానికి చెందిన బీజేపీ నాయకులు కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద ఘనస్వాగతం పలికారు. కాగజ్‌నగర్ నుంచి ఆసిఫాబాద్ వెళ్తున్న క్రమంలో కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద మండల నాయకులు మంగళహారతులు ఇచ్చి స్వాగతం పలికారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణకుమారి, మండల అధ్యక్షుడు రాంబాబు, నాయకులు రాచకొండ రాజయ్య, సునార్కర్ తిరుపతి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

సిర్పూర్(టి): ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఈనెల 9న ఆదివాసీలు విజయవంతం చేయాలని సిర్పూర్(టి) మండల ఆదివాసీ సంఘాల నాయకులు బుధవారం పిలుపునిచ్చారు. ఈసందర్భంగా మండల కేంద్రంలోని కుమురంభీం విగ్రహానికి నివాళులర్పించారు. ఆదివాసీ సంఘాల నాయకులు గంట గోపాల్, టేకం బిక్షపతి, సుర్పం అర్జు, పూజారి ప్రశాంత్, సహిని సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

జోరందుకున్న వరి సాగు

- చెరువులు, కుంటల కింద మొదలైన వరినాట్లు
- మండలంలో 6వేల ఎకరాల్లో సాగు అంచనా
- ఆశించిన స్థాయిలో నిండని కుంటలు, చెరువులు


నాట్లు వేసేందుకు వరినారు పీకుతున్న కూలీలు


నక్కలగూడ శివారులో నాట్లు వేస్తున్న కూలీలు

రెబ్బెన: మండలంలో వానాకాలం పంటల సాగు పనులు జోరందుకున్నాయి. జూన్ రెండో వారంలోనే రైతులు పత్తి విత్తనాలు వేసుకోగా ప్రస్తుతం పత్తి పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. వర్షాలు సైతం పంటలకు అనుకూలంగా కురుస్తుండటంతో వానాకాలం పంటల సాగు పనుల్లో రైతులు బిజీబిజీగా మారారు. పత్తిలో కలుపులు, తెగుళ్ల నివారణ చర్యలు చేపడుతూనే మరోవైపు వరిసాగుపై దృష్టి పెట్టారు. అయితే మండలంలో ఆశించిన రీతిలో సాగునీటి వనరులు లేకపోవడంతో అధిక శాతం రైతులు కుంటలు, చెరువుల కింద వరిసాగు చేపడుతున్నారు. ప్రారంభంలో ఆశించిన స్థాయిలో భారీ వర్షాలు లేకపోవడంతో చెరువులు, కుంటలు నిండలేదు. అయినప్పటికీ వరణుడిపై భరోసాతో రైతులు నార్లు పోశారు. పది రోజుల క్రితం కురిసిన వర్షాలకు చెరువులు, కుంటల్లోకి వరదనీరు వచ్చి చేరడంతో రైతులు వరినాట్లు వేసే పనుల్లో మునిగిపోయారు.

వర్షాలపైనే ఆధారం..

గత సంవత్సరం వానాకాలం మాదిరిగానే ఈసారి కూడ మండలంలోని రైతులు సుమారు 6 వేల ఎకరాల్లో వరిసాగు చేపడుతున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. మండలంలో వరిసాగుకు అనువైన నీటి ప్రాజెక్టులు అందుబాటులో లేకపోవటంతో రైతులు పూర్తిగా వర్షాలనే నమ్ముకుని వరిసాగు చేపడుతున్నారు. వట్టివాగుతో ప్రాజెక్టు ద్వారా మండలానికి సాగునీరు సరఫరా అవుతున్నప్పటికీ కాలువలు, తూములు సరిగా లేని కారణంగా పూర్తిస్థాయిలో పంటలకు సాగునీరు అందడం లేదు. కేవలం వట్టివాగు కాలువల కిందే మండలంలో 12,500 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా కాలువలు, తూముల నిర్వహణ లేకపోవడంతో 2.5 వేల ఎకరాలకు మించి సాగునీరు అందడం లేదు. దాంతో మండల రైతులు చెరువులు, కుంటలనే నమ్ముకుని వరిసాగు చేపడుతున్నారు. ప్రస్తుతం వరినారు నాట్లు వేసుకునేందుకు సిద్ధంగా ఉండటం, చెరువులు, కుంటల్లోకి వరదనీరు వచ్చి చేరడంతో రైతులు వరినాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. పొలాల్లో దుక్కి దున్నడం, కేజీవీల్స్‌తో దమ్ము చేయటం, వరిగట్లను సరిచేయడం వంటి పనులు చేపడుతున్నారు. దమ్ము పనులు పూర్తి చేసిన రైతులు వరినాట్ల పనుల్లో మునిగిపోయారు.

ఈనెలాఖరు వరకు పూర్తి చేసుకోవాలి



మండలంలో ఇప్పుడిప్పుడే వరిసాగు పనులు మొదలయ్యాయి. బోరు బావులు, ఇతర నీటి వనరులు ఉన్న రైతులు ముందస్తుగా వరినాట్లు పూర్తి చేసుకున్నారు. ఇక చెరువులు, కుంటల కింద ఇప్పుడిప్పుడే వరినాట్ల ప్రక్రియ మొదలైంది. అయితే రైతులు ఈనెలాఖరులోగా వరినాట్ల ప్రక్రియ పూర్తి చేసుకోవాలి. చెరువులు, కుంటల కింద రైతులు తక్కువ కాలవ్యవధితో కూడిన వరిని సాగు చేస్తే మేలు. పంటల చివరిదశలో కుంటలు, చెరువుల్లో నీళ్లు లేకుంటే పంట ఎండిపోయే ప్రమాదం ఉంటుంది. – దిలీప్, మండల వ్యవసాయాధికారి

కూలీల కొరత..

వరిసాగులో కూలీల పాత్ర ఎంతో కీలకం. వరినాట్లు వేసే పనులతో మొదలుకుని వరిలో కలుపులు, మందుల పిచికారీ, వరికోత వంటి పనులకు కూలీలు తప్పనిసరి. మండలంలోని అన్ని గ్రామాల్లో చెరువులు, కుంటల కింద వరినాట్ల ప్రక్రియ ఒకేసారి మొదలు కావడంతో గ్రామాల్లో కూలీల కొరత తీవ్రంగా మారుతోంది. వరినాట్లకు బదులు డ్రమ్ సీడర్, వెదజల్లే పద్ధతి, పొడి నెలలోనే నేరుగా వరి విత్తనాలు చల్లడం వంటి పద్ధతులు ఉన్నప్పటికీ వాటిపై రైతులకు అవగాహన కల్పించడంలో వ్యవసాయశాఖ అధికారులు విఫలమవుతున్నారు. దిగుబడి తక్కువగా వస్తుందనే అనుమానంతో నేటికి వరినాట్లు వేసేందుకే రైతులు మొగ్గు చూపుతున్నారు. ఒక ఎకరం పొలంలో నారు వేసేందుకు గరిష్ఠంగా 8 మంది కూలీలు అవసరం. వారికి నారు అందించడం, ఎరువులు చల్లడం, గట్లు సరిచేయడం వంటి పనుల కోసం మరో నలుగురు కూలీలు కావాల్సి ఉంటుంది. బురదలో నాట్లు వేసే పనితో పోల్చితే పత్తిలో కలుపులు తీయడం సులువుగా ఉండటంతో చాలా మంది కూలీలు నాట్లు వేసేందుకు ఆసక్తి చూపడం లేదు. దాంతో కూలీల కొరత తీవ్రంగా మారుతోంది.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి


దహెగాం: మాట్లాడుతున్న సీడీపీవో రెబ్కా


కెరమెరి: గోయగాంలో..

దహెగాం: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో రెబ్కా అన్నారు. బుధవారం మండలంలోని ఇట్యాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ముందుగా గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డకు డబ్బా పాలు కాకుండా తల్లి పాలు పట్టించాలని సూచించారు. సూపర్‌వైజర్ అనసూర్య, అంగన్‌వాడీ కార్యకర్తలు రమాదేవి, సమీనా తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: బిడ్డకు తల్లి పాలిచ్చేటప్పుడు శుభ్రత పాటించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నారు. బుధవారం మండలంలోని కెరమెరి, గోయగాం, ఝరి సెక్టార్లకు సంబంధించిన తల్లిపాల వారోత్సవాలను సుల్తాన్‌గూడ, ఝరి అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలని వారు సూచించారు. అనుసూయ, కవిత, సక్కుబాయి, శ్యామల, లింగుబాయి, శకుంతల, సుహాసిని, సుజాత, అమృత, లూర్దమేరి పాల్గొన్నారు.


పెంచికల్‌పేట్: ఎల్కపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో..

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ పుష్పలత మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ప్రతీరోజు తీసుకునే ఆహారంలో పోషకాహారం ఉండేలా చూసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారం ప్రతీ ఒక్కరికి అందించాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో అల్బర్ట్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డా.అశ్రీన్, ఆరోగ్య కేంద్రం సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కౌటాల: పసి పిల్లలకు తల్లిపాలే శ్రేయస్కరమని సీడీపీవో విజయలక్ష్మి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలో పిల్లలకు అన్నప్రసన కార్యక్రమం నిర్వహించారు.

భగీరథ నీటి సరఫరా పరిశీలన


భగీరథ నీటిని పరిశీలిస్తున్న ఎస్ఈ రవీందర్

దహెగాం: మండలంలోని పంబాపూర్, లగ్గాం, పీకలగుండం, బామానగర్ గ్రామాల్లో సరఫరా అవుతున్న మిషన్ భగీరథ తాగు నీటిని బుధవారం ఎస్ఈ రవీందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో భగీరథ నీరు సక్రమంగా సరఫరా అవుతుందా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కుమురం భీం ప్రాజెక్టు వద్ద చిన్నపాటి మరమ్మతుల కారణంగా రెండు రోజులు సరఫరా కాలేదన్నారు. ప్రస్తుతం అన్ని గ్రామాలకు సరఫరా చేస్తున్నామన్నారు. వర్షాకాలం అయినందున కలుషిత నీటిని తాగొద్దని, భగీరథ నీరు తాగాలని సూచించారు. నీరు సరఫరా కాకపోతే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఏఈ ఇనోస్, తదితరులు ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

లింగాపూర్: మండలంలోని గుమ్నూర్(కే), కొత్తపల్లి పాఠశాలలను బుధవారం ఎంఈవో శ్రీనివాస్ తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రతీరోజు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ప్రతీరోజు ఉపాధ్యాయుల హాజరు నమోదు చేయాలని సూచించారు.

ప్రతీ టీచర్ లెస్సన్ ప్లాన్ రాయాలి

కెరమెరి: ప్రతీ ఉపాధ్యాయుడు లెస్సన్ ప్లాన్ రాయాలని కెరమెరి కాంప్లెక్స్ హెచ్ఎం చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని సాంగ్వి ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. ఎండీఎం, ఎఫ్ఎల్ఎన్, స్టాక్, వీఈఆర్ తదితర రికార్డులను పరిశీలించారు. సమయపాలన పాటించాలని, ఉదయం, సాయంత్రం ఉపాధ్యాయులు ఎఫ్ఆర్ఎస్‌లో హాజరు వేయాలన్నారు. హెచ్ఎం ప్రకాశ్, టీచర్లు ఉన్నారు.

పాఠశాల సందర్శన..

కాగజ్‌నగర్‌టౌన్: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని ఎంఈవో వాసాల ప్రభాకర్ అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ మండలంలోని కొత్త సార్సాల ఎంపీపీఎస్ పాఠశాలను ఎంపీడీవో కోట ప్రసాద్‌తో కలిసి పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, విద్యార్థులు ప్రతీరోజు పాఠశాలకు వచ్చే విధంగా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన వాటర్ మోటారు పని చేయకపోవడంతో వెంటనే ఏర్పాటు చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. వీరి వెంట ప్రధానోపాధ్యాయురాలు మల్లేశ్వరి, సీఆర్పీ ఉమేష్, ఉపాధ్యాయులు ఉన్నారు.


లింగాపూర్: రిజిస్టర్ పరిశీలిస్తున్న ఎంఈవో


కాగజ్‌నగర్‌టౌన్: తనిఖీ చేస్తున్న అధికారులు

సంక్షిప్త వార్తలు

● మహిళల భద్రత కోసమే షీ టీంలు

రెబ్బెన: మహిళల భద్రత కోసమే షీ టీంలు పనిచేస్తున్నాయని భరోసా సెంటర్ ఇన్‌చార్జి ఎస్సై తిరుమల అన్నారు. బుధవారం ఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఏఎస్పీ చిత్తరంజన్ ఆదేశాల మేరకు షీ టీం, భరోసా సెంటర్ల సంయుక్త ఆధ్వర్యంలో మహిళల భద్రతపై గోలేటిలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పించారు.

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని భట్టుపల్లి జెడ్పీఎస్ఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు షీటీం ఆధ్వర్యంలో భద్రతపై బుధవారం అవగాహన కల్పించారు. షీటీం ఇన్‌చార్జి ఏఎస్సై సునీత మాట్లాడుతూ విద్యార్థినులు వేధింపులకు గురైతే కాగజ్‌నగర్ షీటీం నంబర్ 8712670565 సమాచారం అందించాలని తెలిపారు.

● ఆదివాసీ టీచర్ అసోసియేషన్ సభ్యత్వ నమోదు

కౌటాల: ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఆదివాసీ టీచర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తలండి లక్ష్మణ్ అన్నారు. బుధవారం మండలంలోని బోదంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివాసీ టీచర్ అసోసియేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.

చింతలమానెపల్లి: మండలంలోని బాబాపూర్ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆదివాసీ ఉపాధ్యాయ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు తలాండి లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సభ్యత్వ నమోదు రశీదులు అందజేశారు.

● సీఐకి సన్మానం

ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ సీఐగా కొత్తగా పదవీ బాధ్యతలు స్వీకరించిన బాలాజీ వరప్రసాద్‌ను బుధవారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రే విశాల్ ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించారు.

● రాజ్‌గోండ్ సేవా సమితి మండల అధ్యక్షుడిగా అర్జున్

తిర్యాణి: రాజ్‌గోండు సేవా సమితి మండల అధ్యక్షుడిగా కుడ్మెత అర్జున్, ప్రధానకార్యదర్శిగా కనక మల్కులను ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గుణవంత్‌రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలోనే పూర్తి స్థాయి మండల కమిటీని నియమించి ఆదివాసీల హక్కుల కోసం పోరాటం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

● నేడు రేషన్‌కార్డుల పంపిణీ

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మండలంలోని వంజీరి రైతు వేదికలో లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ మధుకర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. రేషన్ కార్డు కోసం మొదటి విడతగా కొత్తగా దరఖాస్తు చేసుకున్న 664 మందికి, రేషన్ కార్డులో మార్పులు చేసుకున్న 4432 మంది లబ్ధిదారులకు రేషన్ కార్డులను గురువారం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

● సమీక్ష సమావేశం

వాంకిడి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వనమహోత్సవం, పీఎంఎస్‌బీవై, జాబ్ కార్డుల అప్‌డేట్, వెదురు ప్లాంటేషన్, పీఎంజన్‌మన్, ఇంటి పన్ను వసూలు, పీఎం ఆవాస్, ఇందిరమ్మ ఇళ్ల తదితర అంశాలపై మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో శ్రావణ్ కుమార్, ఈసీ మోసిన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి


వాంకిడి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..


కాగజ్‌నగర్‌టౌన్: నివాళులర్పిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు


కాగజ్‌నగర్‌టౌన్: చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వాంకిడి: మండలంలోని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, లైబ్రేరియన్ సదానందం, కళాశాల సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ ఉద్యమానికి జీవితాంతం ఎంతో కృషి చేశారని, ఆయన జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. తెలంగాణ కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనరసింహం, అధ్యాపకులు జనార్దన్, రాజేశ్వర్, శారద, దేవేందర్, వెంకటేశం, క్రిష్ణవేణి, రోజ్‌మేరీ ఉన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..

తెలంగాణ యుద్ధనౌక, ప్రజాగాయకుడు గద్దర్ వర్ధంతి, ప్రొఫెసర్ జయశంకర్‌ల జయంతిని బుధవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. శ్యాంరావు, మోయిన్, ముసాఫిజ్, హుస్సేన్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి ఘనంగా నిర్వహించారు.

జైనూర్: మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ ఆవరణలో బుధవారం జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్ నివాళులర్పించారు.

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సింగరేణి అధికారులు ఘనంగా నిర్వహించారు. ఏరియా జీఎం విజయ భాస్కర్‌రెడ్డితో పాటు ఇతర విభాగాల అధికారులు జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐటీయూసీ నాయకురాలు శైలజ, ఎస్వోటూజీఎం రాజమల్లు, డీజీఎంలు ఉజ్వల్‌కుమార్, మదీనాభాషా, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, సెక్యూరిటీ అధికారి శ్రీధర్, డీవైపీఎం రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో..

జయశంకర్ జయంతి బుధవారం గోలేటి టౌన్‌షిప్‌లోని తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు, వెంకటేష్, విద్యాసాగర్, రమేశ్, రాజమౌళి, రాజేశ్ పాల్గొన్నారు.


రెబ్బెన: పూలమాల వేస్తున్న విజయ భాస్కర్‌రెడ్డి

కౌటాల: జయశంకర్ తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త అని మాజీ ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ప్రొఫెసర్ జయశంకర్ జయంతి నిర్వహించారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

ఆసిఫాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ జయంతి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఘనంగా జరుపుకున్నారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో, విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జయంతి ఘనంగా జరుపుకున్నారు.

బెజ్జూర్: తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో అలుపెరగని పోరాటం చేసిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న శ్రీనివాస్

వాంకిడి: ప్రభుత్వ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పీఆర్‌టీయూ టీఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. పాఠశాలల్లో పని చేస్తున్న ఉద్యోగులకు అనేక సమస్యలు ఉన్నాయని వాటిని గుర్తించి ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలన్నారు. కాంట్రాక్ట్ బేసిక్ ఉద్యోగులకు అన్ని రకాల సెలవులు వర్తింపజేయాలని కోరారు. సంఘం మండల అధ్యక్షుడు వినేష్ ఉప్రె, ప్రధాన కార్యదర్శి జగదీష్, నాయకులు ఖాదర్, గిరి, తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: ఇటీవల వచ్చిన ఎఫ్ఆర్ఎస్‌తో చాలా మంది ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆడే ప్రకాశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.

పైప్‌లైన్ వేసి.. మురికినీరు తొలగించి


పైపులైను ఏర్పాటు చేస్తున్న మురళీధర్

రెబ్బెన: మండలంలోని వంకులం ఎస్సీ కాలనీలో రోడ్డుపై మురికి నీరు నిల్వ ఉండటంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మురికి నీరు రోడ్డుపై నిల్వ చేరకుండా చర్యలు చేపట్టగా, పంచాయతీకి చెందిన అజ్మీర మురళీధర్ సొంత ఖర్చులతో మురికినీరు కాలువల ద్వారా వెళ్లేలా జేసీబీతో పనులు చేయించారు. కాలువ తవ్వి, పైపులు వేసి నిల్వ చేరిన మురికినీటిని తొలగించారు. రెండున్నర నెలలుగా మురికినీటి నిల్వతో ఏర్పడిన సమస్యకు పరిష్కారం చూపిన ఎస్సై, మురళీధర్‌లకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.